# ఆదర్శజీవి

రవణిగాడు— కాదుకాదు, బొడ్డుంబాలు—రవణారావు— మొదటినుండీ గొప్ప ఆదర్శజీవి, ఆశావాది! అయితేనేం- వా డెంత యిది అవుతాడో అంతా అయింది! అందుకు వాడే కారణమో, వాడి అదృష్టమే కారణమో ?

చిన్ననాటినుండిఆశయాలంటూ, ఆదర్శాలంటూ, బూజులు దులపాలని ఏడుస్తుండేవాడు! ప్రయత్నిస్తే ప్రతివాడూ ఆదర్శ వంతంగా గడపవచ్చు అని అతని వూహ!— వాడికి అక్కర్లేని విషయం లేదు. తెలియనిది అంటూ లేదని మనం అనుకోవాలిట! వాడితో మాటాడితే రాజకీయాలనుండి రాఘ్వారప్పలవరకూ అన్నీ కూలంకషంగా వచ్చు ననుకుంటాడు. ప్రతివిషయం అనుభవించే ముందు తెలుసుకోవాలి అంటాడు. అలాంటివాదం వాడిది.

అందుకేకాబోలు ! వాడిపెళ్ళికిముందు వాడికున్న తెలివి తేటలన్నీ వెళ్ళబోశాడు. పెళ్ళిఅంటే ఏమిటి? ప్రపంచంలో ఏఏ దేశాలలో ఎలాటి పద్ధతులు అవలంబిస్తున్నారు ? అందులో ఏ దేశాచారం మంచిది? ప్రేమఅంటే ఏమిటి ? అదెలా వుండాలి? ఎప్పుడు ప్రేమించాలి? పెళ్ళికి ముందా ? పెళ్ళాడా? లేక ప్రేమ అవసరం లేదా ?— ప్రేమకి పెళ్ళి అన్నది కన్నెలాటిదా ? పెళ్లి చేసుకోవడం పిల్లలకోసమా ?

పరమానందంకోసమా? ఆదర్శదంపతుల లక్షణాలు ఏమిటి? స్వర్గసీమలాటి సంసారం గడపడానికి అనుసరించవలసిన రీతు లేవి? పిల్లలు ఎంతమంది- ఏ నిష్పత్తిలో వుండాలి? వాళ్ళను ఏ విధమయిన క్రమశిక్షణలో పెంచాలి?- ఇలాటివన్నీ తెలుసుకోతలచి వాటికోసం మందరపర్వతమథనంచేసి వదిలి అప్పు డుద్భవించిన సందేహాలకు సమాధానాలు దొరక్క- ఆఖరికి ఎలాగో సరిపుచ్చుకుని, తను ఔను అనుకున్నదాన్ని- మాటలమధ్యలో అందరితోను సిద్ధాంతీకరించి చెబుతుండే వాడు——

ఇంత అయినా ఆఖరికి వాడిపెళ్లి ఎలాజరిగిందీ, ఎలాటి దాన్ని పెళ్ళాడిందీ—— అందరికీ తెలిశాక ఏమనుకుంటే ఏం లెండి!

మనవాడికి ముందునుండీ మంచి హోదాగల ఉద్యో గమే చేయాలనీ, పసందయిన బంగళాలో వుండాలనీ, ఆ బంగ ళాకు చుట్టూ బృందావనంలాంటి తోట వుండాలనీ, సాయంత్రం తనూ తన ఇస్త్రీనూ కలిసి అందులో- ఒకచో చెట్టా పట్టాలుకట్టి విహరిస్తూ, కొండొకచో కూర్చుంటో, మరొకచోట వూయలలూగుతో, వేరొకచో పూలపొదల్లో ప్రేమించుకుంటో యిలా ప్రబంధాల్లో నాయికా నాయకుల్లా గడిపివేద్దామని అనుకొనేవాడు.

తనకు కాబోయే సహధర్మచారిణి ఎలాటిదై వుండాలి? అక్షరాలా వాడూహించుకున్నట్లు చెప్పతరం కాకపోయినా ఊహిస్తే-ఒక నవనాగరికురాలయి వుండనోపు ననిపిస్తుంది వాడి ధోరణి బట్టిచూస్తే.

తూనీగ రెక్కలవంటి రిబ్బను ముడిగల రెండు జడలతో, అర్ధనగ్నంగా కనబడుతూ ఉవ్విళ్ళూరించే నైలాను చీరతో, మామిడిచిగురాకువంటి శరీరంతో ఎత్తుజోళ్ళు తొడుక్కొని పోతుంటే, నడుంమాత్రమే కదిలే నడకతో పురుగజం గుడ్డతో తయారుచేయబడ్డ వెంటిలేటెడ్ బ్లౌజుతో ఫాషన్ అంతా ఒక్క ఎడంచేతికే వచ్చిందాఅన్నట్టు ఒక రిస్టువాచీతో, చెవులకు చక్రాలతో నలుగురూ చూస్తున్నప్పుడు నీవేతప్ప నాకు వేరేలోకం లేదు అని అనుకుంటూ మీదపడి మాట్లాడే యువతి కావాలి. మనసుల్లో ఎలావున్నా పైకి మాత్రం— యిద్దరూ ఎంత అన్యోన్యంగా వున్నారు! ధన్య జీవులు. దాంపత్యంఅంటే అలావుండాలి అని అందరూ అనుకోవాలిట. అదీ వాడికి కావాలి.

కాని తాజాగా లోకంలో ఎక్కువ ప్రచారంలోవున్న విషయాలమీద, గొప్పగొప్ప వాళ్ళు ఆసమయంలో చర్చించే విషయంమీదా అతడుదృష్టి వుంచుతాడు. అవే సంగతులను ప్రచారంచేసినట్టు అందరికీ చెబుతాడు. ఆవిషయం 'మనకెందుకు' అని లేదు. మాటకి ఒకగొప్ప నాయకుడెవడైనా ఒకవిషయం గురించి... అంటే అణుఆయుధాలు విసర్జించాలి— అని -లెక్చరిస్తే తనూ అది నిజమేనని ఏవేవో ఉదాహరణలు కూడా చూపెట్టి వాదిస్తాడు. మరొక గొప్పవాడెవడైనా "దేశంలో పాప్యులేషన్ మితిమీరిపోతుంది అంచేతతగ్గించాలి" అని ఉపన్యాసం యిచ్చేసరికి మనవాడూ అందుకుంటాడు.

"అవును! మన దేశం మరీని! బొత్తిగా మాయల మరాఠీ సంతానం అయిపోతూంది ప్రతీయింట్లో" ఎవరూ

పట్టించుకోరుకదా ! అందుకే కరువూ బాధలూ లావయి పోతున్నాయి. దీనికి మందు ఎకనామిక్సులో చెప్పినట్లు— ఒకటి, ఉన్న మనుష్యుల సంఖ్యని తగ్గించడం ! రెండు, మరి జనసంఖ్య పెరగకండా చేయడం !

మొదటిదానికి కరువుకాటకాలు తెచ్చిపెట్టడం, యుద్ధం తెచ్చిపెట్టి అందులో మనుష్యులని చంపడం, దీనికోసం మన పెద్దరాజ్యాల వాళ్ళందరూ ప్రయత్నిస్తున్నారు. ఇంక మన లాంటివాళ్ళు చేయవలసింది ఫామిలీప్లానింగు కుటుంబ నియంత్రణ.

అసలు యిద్దరుపిల్లలకన్న ఎక్కువ వుండకూడదు. కాని మన హిందూ ధర్మశాస్త్రంలో యీ కుటుంబనియంత్రణ అన్నది లేదేమోమరి! లేకపోతే శాస్త్రప్రకారం చూస్తే మొయ్యడానికి నలుగురూ, అగ్గికుండపట్టునేందుకు ఒకడూ— అప్పుడే అయిదుగురు అయిపోయినారు. ఇంక ముచ్చటికి ముగ్గురేనా ఆడపిల్లలుండవద్దా !... కనీసం మీాదబడి ఏడవ డానికయినా... దానికేం...

అసలు ఎక్కువమంది పిల్లలుండకూడదు. అదీ పెళ్ళి అయిన అయిదారేళ్ళవరకూ అసలే వుండకూడదు! లేకపోతే ఆదంపతులేం ఆనందిస్తారు ? పిల్లలుంటే సినిమాలకీ షికార్లకీ వీలుంటుందా? ఎత్తుకోమంటారు. ఏడుస్తారు సరదాగా తిరగ నివ్వరు. ఇంక కోడిలాగ ఆపిల్లలతో, యింట్లోనే ఏడవ వలసివస్తుంది. అదేం జీవితం ? అదీకాక పిల్లలతో, ఖర్చులు లావు. వాటితో సతమతమయి సంతానం ఎక్కువవుతున్న కొద్దీ జీవితంచాలక దరిద్రగొట్టులవాలి... ఆఖరికి.

వాడి పరిస్థితి ఎప్పుడూ ఇంట్లో భార్య అనారోగ్యంతోనూ, పిల్లల రోగాలకూ రొచ్చులకూ, అసుపత్రులలోనూ, జీతంచాలక, అప్పులిచ్చేవారి వెనకాల తిరగడంతోనూ గడిచిపోయి దరిద్రమా అంటే ఓయ్ అనిపలుకుతూవుంటాడు మానసికంగా ఆర్థికంగా శారీరకంగా చితికిపోయి, జీవితంలో ఆనందానికిబదులు దుఃఖం కొనితెచ్చుకున్న వాడవుతాడు. అది స్వయంకృతాపరాధం కాదూ? ఆదర్శవంతంగా జీవితం గడపాలంటే మనచేతిలోనే వుంది. కుటుంబ నియంత్రణ ముఖ్యం. ఒక పిల్లకి మరోపిల్లకి నాలుగయిదేళ్ళు అయినా ఎడంవుండాలి. అప్పుడే మనదేశానికి మనకి ఉపకారం అని ఒక్కబిగిని లెక్చరు దంచేస్తాడు.

అంటే తను అచ్చం ఎలా గడపాలని అనుకుంటాడో అదంతా చెప్పేస్తాడన్నమాట.

అందుకే అప్పుడు, రవిణిగాడు యీమధ్య రవణారావయి మళ్ళీ యిప్పుడు రవిణిగాడు అయిపోయాడు. ఇన్ని కబుర్లూ చెప్పినవాడి ఈస్థితిచూస్తే తెలిసినవారికి ఆశ్చర్యం కాదూ? అలాంటి ఆదర్శజీవి యీనాడు ఆ ఆదర్శాలన్నీ బూజులుపట్టి గోడలకి వ్రేలాడుతుంటే వాటిని పైకితీసి దులిపే సాహసమైనా లేకపోవడంచూస్తే జాలిపడాల్సి వస్తూంది.

ఒకప్పుడు కట్నాలు కూడవని మానవ సమాజానికి యీ కట్నసమస్య ఒక పిశాచంలా పట్టుకుందని, అదిపోతేనే దేశం బాగుపడుతుందని ఆడవారు, మగవారు సర్వసమానంగా జీవించాల్సిన యీకాలంలో యీకట్నం అనే లంచం

యిచ్చి గొనుక్కోవడం ఏమిటి?... పెళ్ళికాని యువకులందరూ కట్నాలు నిషేధించి మార్గదర్శకులు కావాలని" పెద్దకబుర్లు చెప్పిన రమణ యీనాడు—

"నువ్వెందుకురా అయిదువేలు కట్నంపుచ్చుకుని పెళ్ళాడేవు?" అని అడిగితే—

"అబ్బే నేపుచ్చుకోందే! వాళ్ళకు కట్నం యివ్వకండా పెళ్ళిచేయడం పరువుతక్కువట! డబ్బు బాగావుంది. అందుకవి కట్నంక్రిందకాదు బహుమతిక్రింద యిచ్చేరు అంతే" అని జవాబు చెబుతాడు.

డిగ్రీ పుచ్చుకున్న అమ్మాయినే పెళ్ళాడి ముందు ఆమె పేరూ మధ్య తనపేరూ వెనక ఆ డిగ్రీనితగిల్చి లతారమణా రావు అనో కమలా రమణారావు బి. ఎ. అనో- ప్రమదా వనంలోగాని వనితాలోకంలోగాని తనభార్యపేరు చూసుగొని యీనాడుకదా మనస్త్రీలు నిజంగా పేరులోకూడా అర్ధాంగిలని అనిపించుకుంటున్నారు! అని సంతోషిద్దామనుకున్నాడు. కొసకి అ ఆ లుకూడా రానిదాన్ని పెళ్ళాడాడంటే వాడేం చేస్తాడుపాపం!... వాడికి దగ్గరసంబంధం ఒకటి దాపురించిందట. ఆపిల్లనే చేసుకోవాలని లేకపోతే ఉరెట్టుకు చస్తాంఅని తల్లిదండ్రులు పట్టుపట్టారట. అంచేత తల్లిదండ్రుల మాట జవదాటలేక ఆనాటి శ్రీరామచంద్రుని ఆదర్శంగా పెట్టుకొని పెళ్ళాడేశాడట! అయినా "చదువులేకపోతేనేం అందంవుండాలి ఆడదానికి! చదువుకొని ఊళ్ళేలాలా ఏం?" అని ప్లేటు సుళువుగా మార్చేశాడు.

పెళ్ళిఅయిన క్రొత్తలో సినిమాలకని, షికార్లకని తిరగడానికి ప్రయత్నించినా పట్నవాసం నీళ్ళుతాగని ఆపిల్ల పాతకాలపు పెళ్ళాంలా ముందుకు రాలేకపోయేసరికి విసుగెత్తి వూరుకోక తప్పిందికాదు. అప్పటినుండి ఎవరైనా అడుగుతారని కాబోలు— "జంటగా చట్టాపట్టాలు కట్టుకు బజార్లంట తిరుగుతేనేగాని భార్యాభర్తలని అనుకోరా ఏమిటీ! అదీగాక తిరిగి ఆడది చెడింది, తిరక్క మొగాడు చెడతాడు" అని అనడం మొదలెట్టేడు.

ఒకనాడు భార్యను బలవంతాన్న బజారుకు తీసుకువెళ్ళి జోడుకొందామని బాటాషాపులోకి రమ్మనేసరికి, ఆవిడ యివతలే నిలబడి మీరే కొని తీసుకురండి, నాకు సిగ్గు మొగాళ్ళమధ్య జోళ్ళు తొడిగించుకోవడం ఏమిటి?— అని జవాబు చెప్పింది. ఈకాలంలో మొగాళ్ళు గాజులు తొడిగించుకుందికే సరదాపడుతూంటే యీావిడకు జోళ్ళు తొడుక్కునేందుకు సిగ్గేమిటో! అని బోధపడక "అయ్యో! కొలత లేందే ఎలా?" అని నెత్తీనోరు బాదుకున్నాడు. కాని ఆమె ససేమిరా రాను అని యింటికి వచ్చేసింది. ఆతర్వాత ఏ అట్టముక్కో కొలతపట్టుకుపోయి రవణ జోడు తేవడం మానలేదు.

భార్య ఎంత పాతకాలపుదైనా నవనాగరికతకు కనీస చిహ్నమైన 'జోడు, లేకపోతే రవణకు ఎంత చిన్నతనం? కాని ఏం లాభం? ఆమె తొడుక్కుంటేనా? ఒకరోజు తొడగ్గా అది కరిచింది. ఆరు నెలలలో ఏడాదిపాటో ఆ కురుపుతోనే సరిపోయె! ఆతర్వాత ఆజోడు పాటి అయిపోయిందామె! ఏది ఎలావున్నా ఆమె జోడు తొడుకున్నా తొడుక్కోనక

పోయినా జోడుకొని పడేశాడు. కాబట్టి తన ఆశయం నెరవేరి నట్టే అని భావించాడు.

రవణారావు తనభార్యతో చిలకాగోరింకలా, చేతులు కలుపుకువెళ్ళి తన స్నేహితులకి పరిచయం చేద్దాం అను కున్నాడు. అలాగే పెద్ద పార్టీ చేసి అందరినీ ఆహ్వానించి చిరునవ్వుతో... ఈమె నాభార్య అని గర్వంగా చెప్పబో బోయాడు. కాని అదే మొదటిసారీ, ఆఖరిసారీ అయింది. మళ్ళీ ఆ స్నేహితులు "మరి నీభార్యను తీసుకురాలేదేం?" అని అడిగితే_

"మన పెళ్ళాలకు, చెల్లెళ్ళకు ఆ స్వాతంత్ర్యం పనికి రాదురా" అని ముక్తసరిగా జవాబిచ్చేడు మహానుభావుడు! అంటే మన ఆడవాళ్ళు తప్పించి మిగతా స్త్రీలకి ఆ స్వాతం త్ర్యం వుండాలి. అప్పుడు ఆ అవకాశం తను వినియోగించు కోవాలి! అంతే!తనవరకూ వచ్చేటప్పటికి పనికిరాదన్నమాట!

కాని అసలుసంగతి ఏమిటి? రవణిగాడు మొదట్లో ఏదో పెద్ద విశాలభావంతో అందరినీ పిలిచి పెళ్ళాంగారిని పరిచయంచేసిన రోజున ఒక ఆత్మస్నేహితుడు రవణభార్య భయంతో నమస్కారంచేస్తూంటే బలవంతాన్ని చెయ్యి అందించి కరచాలనం చేశాడు. రవణభార్య తబ్బిబ్బై అలా చేయకపోతే భర్త ఏమంటాడో అన్న బెంగతో ఆ గాబ రాలో చెయ్యి జాపేసింది. ఆ ప్రాణస్నేహితుడు షేక్‌హాండ్ చేసినట్టే చేసి ఆమె అరచేతిలో గోకాడట! ఆ సంఘటనకి అవిడ బిక్కచచ్చినట్టయి అలాగే చూస్తూ వుండపోయేసరికి

అది తెలియక రవణారావు మరోలా భావించి అప్పటికి అవనిచ్చి ఆతర్వాత భార్యను అనుమానంతో "ఎందుకలా వాడివైపు చూశావ్?" అని అరిచాడట! ఆమె మొదట్లో చెప్పడానికి సంకోచించినా రవణవాలకంచూసి చెప్పేసింది.

"హారి వీడి స్నేహం మండా! ఎంతద్రోహం చేశాడు? ఛీ...! అందుకే మనవాళ్ళ పద్ధతులే యీ ఆడవాళ్ళ విష యాల్లో మంచివి" అని రవణ అనుకొని తిరిగి అటువంటి పిచ్చి పిచ్చి వేషాలు వేయడం మానేశాడు. అదీ కారణం.

పాపం! పెళ్ళవకపూర్వం ఏమోగాని పెళ్ళయి కాపు రానికి వచ్చేక రవిణిగాడి పెళ్ళాం మరి కేజువల్‌లీవు తీసుకో లేదు! రవిణిగాడి గుండెల్లో రాయిపడింది. ఇప్పటినుండే యిదొకటా కర్మ! అధమం అయిదారేళ్ళయినా యిద్దరూ హాయిగా ఏ బాదరబందీలేకుండా గడుపుదామని ఎన్నికలలు కన్నాడు! అదేం ముహూర్తబలమోగాని వెంటనే భార్య నెలతప్పాలా? ఏమీలేనిదానికన్నా ఉన్న ఆ భార్యతోనే తృప్తి చెందుదామన్నా రవిణిగాడికి ఆ అదృష్టం పట్టలేదు.

రవిణిగాడి ఆట కట్టేసింది. ఆవిడగారికి వేవిళ్ళు ప్రారంభం అయిందగ్గర్నుండి యీతనికి వేరేపక్క శరణ్యం అయింది. ఏం చేస్తాడు? కాని తను ఎన్నెన్ని ఆశయాలూ ఆదర్శాలూ పెట్టుకున్నాడు? ఆఖరికి ఎలాగైంది? అన్నీగంగలో కలిసినట్టేనా? ఇంక ప్రతిఏడాదీ యీ సంతానాన్ని ఆపడం ఎలాగ? అబ్బ! యింత ఏదీ? నిన్న బ్రహ్మచారి, యివాళ గృహస్థు, రేపు తండ్రీ! ఆహా! ఎన్ని ఉద్దేశాలువున్నా

ఏంలాభం? తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడంటారు యిదేనేమో! అని అనుకున్నాడు.

ఇంకేముంది? అయిదోనెల రాగానే రవణభార్యను పుట్టింటివారు తీసుకువెళ్ళిపోయారు. ఇక మనవాడి సంగతి చూడండి! ఏద్దో మొద్దో ఆమెవుంటే ఒకలావుండేది. లేక పోగానే ఏదో వెలితి కనిపించింది. అంత వేగిరం పిల్లలు ఒద్దను కున్నా, నెలలు దగ్గిరవుతున్నకొద్దీ రవణిగాడికూ్కడా ఏదో చెప్పలేని కలవరం ఆతురత, అభిమానం, ప్రేమ లోలోపల నుండి పుట్టుకువచ్చాయి. ఒకటి రెండుసార్లు భార్యని చూసి వచ్చాడుకూడా.

భార్యకు పురిటిరోజులు దగ్గిరపడ్డాయి. ఏరోజు ఆ శుభ వార్త వస్తుందా అని పైకి యిష్టంలేకపోయినా, ఆదుర్దా గానే వున్నాడు.

ఆరోజు ప్రొద్దున్నే యివతలికి వచ్చేసరికి ఒక కుక్క తన నాలుగుపిల్లలతో తోక ఎగరేసుకుంటూ పోతోంది. వెనక పాడుగుపట్టి పీకుతూ ఆ నాలుగుపిల్లలూ వెంటబడు తున్నాయి. తల్లికుక్క విసుగుతో, చికాగుతో, కోపంతో గుర్రుమంటూ పిల్లల్ని కాలితోతంతూ విదిలించుకోబోయి ఏంచేయలేక వూరుకొంటూంది.

రవణకు అదోలా అనిపించింది, ఎదురుగుండా యింట్లో యిల్లాలు ఒక చంకని చంటిపిల్లను వేసుకొని మరో పిల్లడిని యివతల కాలవదగ్గర కూర్చోబెడుతూండగా మరోనాలు గేళ్ళవాడు ఏడుస్తూ కొంగుపట్టుకు ప్రేళ్ళాడుతూవుంటే ఆమె

చికాకుతో ఛెళ్ళుఛెళ్ళున వాడిని కొట్టినాగా బాధపడు తోంది వాళ్ళని అదుపులో పెట్టలేక.

రవణ అదికూడాచూసి మరోలా అయిపోయ్యాడు. వెంటనే యింట్లోకి వచ్చేశాడు. పొరుగింటిలో కురుక్షేత్రం జరుగుతోంది. ఆ యింట్లో పిల్లలసంఖ్య ఆ తల్లిదండ్రులకే ఎప్పటికప్పుడు లెక్క వేసుకుంటేకాని తెలీదేమో! ఆ పిల్లలు అరుస్తున్నారు, కొట్టుకుంటున్నారు, ఏడుస్తున్నారు, యిల్లెగిరి పోయేట్టు చప్పుళ్ళు చేస్తున్నారు. ఆ తల్లి వారిని సముదా యించలేక తనని తనే తిట్టుకుంటూంది. ఆ తండ్రి ఆ బాధ పడలేక గొడుగు చంకనబెట్టుకుని బయటకు జారుకున్నాడు. అది చూచి రవణ చెవులు మూసుకుని "ఏం సంతానంరా బాబూ! పగవాడికయినా యింతమంది పిల్లలుండకూడదు. పిల్లలు లేనివాళ్ళు ఎంత అదృష్టవంతులో"అని అనుకున్నాడు.

ఆ సమయంలోనే. పోస్టుమేను ఒక వుత్తరం యిచ్చాడు. ఆ కవరుమీద పసుపు మరకలు చూసేసరికి అత గాడి కళ్ళు పచ్చబడ్డాయి. అది అత్తవారి వద్దనుండి వచ్చిన శుభలేఖ అని తన సంసార జీవితపరీక్షలో భార్యాభర్తల రిజల్టువచ్చిందని యిట్టే గ్రహించాడు.

ఇంతవరకూ చూసిన దృశ్యాలూ– తన మనసులో వున్నదీ– ఇప్పు డీ శుభలేఖ – అతని మనసు ఎలా వుంటుందో మనం వూహించలేం. మనసు ఆతురతతో ఉరకలేస్తున్నా, ఇష్టం లేనట్టె కవరు విప్పేడు. అందులో–

చి॥ అల్లుడు రవణారావుకు ఆశీర్వదించివ్రాయునది–

హేవిళంబినామ సం॥ర పుష్య బహుళ అష్టమీ ఆదివారం చిత్తానక్షత్రమందు మధ్యాహ్నం 2-30 - 3 గం॥ మధ్య చి॥ సౌ॥ రమణమ్మకు ద్వితీపుత్రికా జననమయింది. తల్లి, కవలపిల్ల లిద్దరూ క్షేమం. నెలకొక దినము తక్కువచేసి బారసాలచేయ నిశ్చయించినాము గావున ఆరోజునకు రెండు రోజులు ముందుగా సెలవు తీసుకుని వచ్చి బారసాల జరిపించు కొనవలయును.

ఇట్లు

మీ మామగారు శంకరయ్య.

ఈ వుత్తరం చదివాక రవిణిగాడి భావాలు ఎలా వున్నాయో చెప్పడం వేరే ఎందుకు? తనేలాంటి భార్యని పెండ్లాడుదా మనుకున్నాడు? భార్యతో యీ నాగరికతా ప్రపంచంలో ఎలా కులాసాగా గడుపుదామనుకున్నాడు? పోనీ అవన్నీ జరక్కపోయినా ఏదో సంసారపక్షంగా తృప్తి పడి బ్రతుకుదామనుకున్నాడు. కనీసం అయిదారేళ్ళయినా పిల్లాపీచూ లేకుండా సుఖంగా, హాయిగా గడుపుదా మను కున్నాడు.

అలా జరగలేదు సరికదా, భార్య వచ్చినవెంటనే పిల్లల కోసమే వచ్చినట్లు నెల తప్పింది! పోనీ, ఏదో ఒక పిల్లతో సరిపుచ్చుకుని యికమీదయినా జాగ్రత్తపడదాం అని మనసు నిబ్బరం చేసుకొనేసరికి ఒక్కసారే కాంపలో తక్కు వయినట్టు ఇద్దరిని కనేసింది!

ప్రస్తుతం భారత నారీమణులు ఒక పిల్లతో సముదా యించలేక జీవచ్ఛవాల్లా తయారవుతూంటే, యిక యిద్దరు

కూడానా? దానిమాట కేంగాని, ఆహా! తానప్పుడే యిద్దరు పిల్లల తండ్రా?... ఘోరం! అందులోనూ ఇద్దరూ ఆడపిల్లలే నట! ఒక్క ఆడపిల్లయితేనే, దాని నెలా పెంచడం- దానికి కట్నంయిచ్చి ఎలా పెళ్ళి చేయడం- అని అందరూ బెంగపెట్టు కుని- ఆ ఒక్క పిల్లకే కట్నంపోసి పెళ్ళిచేసి పంపేసరికి ఫకీరు లయి ప్రారబ్ధానికి ఏడుస్తూంటే- తనకేదో ఆస్తిమూలుగు తున్నట్టు ఒక్కసారే తనకు యిద్దరాడ పిల్లలు! ఓ భగవం తుడా! నేనొక్కడినే కనుపించేనా కసితీర్చుకునేందుకు?

ఈ విధంగా బుర్రలో ఆలోచనలు గిర్రున తిరిగి, తన గుమాస్తా వుద్యోగం జ్ఞాపకానికివచ్చి రవణ ఆశ్చర్యంతో విచారంలో, బెంగతో, కోపంతో, చికాకులో, ఆతురతతో, ఆవేదనతో యిన్నెందుకు యింకా ఎన్ని ఫీలింగ్సు వుండాలో అన్ని ఫీలింగ్సు ఒక్కసారి కలిగి అలాగే నోరు తెరచి కళ్ళప్ప గించి ముచ్చెమటలూ పోయగా ఆదర్శాలన్నీ నీళ్లుగా కళ్ళంట జారగా అక్కడే కూర్చుండిపోయాడు, ఆదర్శాలతోపాటు రవణారావుగా మారిన రవిణిగాడు.